
www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 25 సెప్టెంబర్ 2023



ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణే లక్ష్యం

యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు


తిరుపతి యుటిఎఫ్ కార్యాలయం వద్ద..

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: ఆదివారం యుటిఎఫ్ స్వర్ణోత్సవం సందర్భంగా తిరుపతి నగరానికి ప్రచార బైక్ జాతా చేరుకుంది. ఈసందర్భంగా స్థానిక పెద్దకాపు లేఅవుట్‌లోని యుటిఎఫ్ కార్యాలయంలో యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు జెండా ఎగురవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి ఉపాధ్యాయులలో స్నేహపూరిత బోధనా సౌకర్యాలు కల్పించాలని, ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించడానికి ఉపాధ్యాయులందరూ సమైక్యం కావాలని కోరారు. పాత పెన్షన్ విధానం పునరుద్ధరించే వరకు విశ్రమించ రాదని, యూటీఎఫ్‌లో ఉత్సాహాన్ని నింపుతూ ఈ బైక్ జాతా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇది ఉపాధ్యాయ బృందానికి స్వర్ణోత్సమని, ఉపాధ్యాయ సమస్యలపై అనునిత్యం రాష్ట్ర కమిటీ పోరాడుతున్నదని ఇదే స్ఫూర్తితో రాబోయే తరంలో వారు పోరాడి ఉద్యమస్ఫూర్తిని నింపాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎస్ నాయుడు, జిల్లా అధ్యక్షులు జిజె రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి ముత్యాలరెడ్డి, దేవరాల నిర్మల, కందల శ్రీదేవి, పత్తిపాటి రమేష్ నాయుడు, జనార్ధన రెడ్డి, ఆమూరు సుబ్రహ్మణ్యం, దండు రామచంద్రయ్య, బండి మధుసూదన్ రెడ్డి, కావూరు ప్రభాకర్, హరిబాబు, మస్తానయ్య, సుధీర్, శేఖర్, పద్మజ, దాసరి మునెయ్య, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి చేరుకున్న యూటీఎఫ్ స్వర్ణోత్సవ జాతా

యూటీఎఫ్ స్వర్ణోత్సవ సభ ప్రచార జాతా ఆదివారం సాయంత్రం శ్రీకాళహస్తికి చేరుకుంది. ఏపీ సీడ్స్ కూడలి వద్ద స్థానిక యుటిఎఫ్ నాయకులు ప్రచార జాతాలో పాల్గొన్న నాయకులకు సాదర స్వాగతం పలికారు. అనంతరం సుమారు 100 బైకులతో పట్టణ నాలుగు మాడ వీధుల గుండా జాతా ర్యాలీ నిర్వహించారు. తదనంతరం జాతా దక్షిణ కైలాస నగర్ లోని పుచ్చలపల్లి సుందరయ్య భవన్‌కు చేరింది. అక్కడ యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు ఆ సంఘం పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ 50 సంవత్సరాల జీవిత గమనాన్ని నాయకుల ఎదుట గుర్తు చేసుకున్నారు. ఉద్యమ సంఘం యూటీఎఫ్ తోనే ఉద్యోగులు, ఉపాధ్యాయులు తమ హక్కులను కాపాడుకోగలరని సూచించారు. జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి ముత్యాలరెడ్డి, శ్రీనివాసులు, సూర్యప్రకాష్, విజయ్ కుమార్, వెంకటకష్ణ పాల్గొన్నారు.


శ్రీకాళహస్తిలో..

'కొరటాల'

ఆశయ స్ఫూర్తితో ఉద్యమిస్తాం!


తిరుపతిలో..

ప్రజాశక్తి-తిరుపతి టౌన్: సిపిఎం మాజీ పొలిట్ బ్యూరో సభ్యులు, ఉమ్మడి రాష్ట్ర కార్యదర్శిగా పనిచేసిన కామ్రేడ్ కొరటాల సత్యనారాయణ శతజయంతి సభను ఆదివారం యశోదనగర్‌లోని ఎంబి భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర నేతలు దడాల సుబ్బారావు, ధనలక్ష్మి, జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కందారపు మురళి తదితర నేతలు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దడాల సుబ్బారావు, ధనలక్ష్మి మాట్లాడుతూ కొరటాల రైతాంగ సమస్యల మీద, చేనేత కార్మికుల సమస్యల మీద రాజీలేని పోరాటాలు నిర్వహించాడని కొనియాడారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా కొరటాల స్ఫూర్తితో ఆయన ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. సిపిఎం నేతలు గంగరాజు, సుబ్రమణ్యం, జయచంద్ర, మాధవ్, సాయిలక్ష్మి, వేణు, ఓవి.రమణ, చల్లా వెంకటయ్య దేవానందు, పద్మజ, వనజ, పద్మ సీనియర్ జర్నలిస్ట్ రాఘవశర్మ తదితరులు పాల్గొన్నారు.

గూడూరు టౌన్ : రైతాంగ, చేనేత, కౌలు రైతు ఉద్యమ నిర్మాత, సిపిఎం మాజీ పొలిట్ బ్యూరో సభ్యులు కొరటాల సత్యనారాయణ శత జయంతి సభ గూడూరు పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించారు. ఈసందర్భంగా పార్టీ సెంట్రల్ శాఖాకార్యదర్శి జోగి శివకుమార్, సిఐటియు నాయకులు వెంకట రామిరెడ్డి ఆధ్వర్యంలో ప్రజాసంఘాల నాయకులు కొరటాల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు సురేష్, పి.మణి, పి.శంకరయ్య, ఏ.ప్రసాద్, బివి.రమణయ్య, బి.చంద్రయ్య, వెంకటసుబ్బయ్య, ధనమ్మ, నరసమ్మ, వరలక్ష్మీ, సాయిప్రసన్న పాల్గొన్నారు.


గూడూరులో..

శ్రీవారి ధర్మరథం చోరీ

ట్రాన్స్‌పోర్ట్ అధికారులు నిర్లక్ష్యం
బాధ్యత మరిచిన విజిలెన్స్ సిబ్బంది


నాయుడుపేట వద్ద బస్సును గుర్తించిన పోలీసులు

ప్రజాశక్తి- తిరుమల: తిరుమల ఎలక్ట్రిక్ బస్సు మిస్సింగ్ కలకలం రేపింది. ఆదివారం వేకువజామున తిరుమలలో ఉన్న టిటిడి ఉచిత బస్సు మిస్ అయింది. ఉదయం 4 గంటలకు ఎలక్ట్రిక్ బస్సు జిఎన్‌సి టోల్ గేట్ దాటినట్లు విజిలెన్స్ అధికారులు గుర్తించారు. గత వారం రోజులు క్రితం కూడా ఎలక్ట్రిక్ కారు కూడా మిస్సింగ్ అయిందని తాజాగా వెలుగులోకి వచ్చింది. ఒంటిమిట్ట రామాలయం వద్ద కారును గుర్తించింది భద్రతా సిబ్బంది. కారు మిస్సింగ్ పై పోలీసులుకు ఫిర్యాదు చెయ్యకపోవడంతో దర్యాప్తు జరుగలేదు. ఇక ఇప్పుడు ఆదివారం తిరుమల బస్సు మిస్సింగ్ కలకలం రేపింది. తిరుమలలో ఉన్న టిటిడి ఉచిత బస్సు మిస్ అయింది. ఎలక్ట్రిక్ బస్సులో జిపియస్ ద్వారా ట్రాక్ చేసి అధికారులు గుర్తించారు. నాయుడుపేట వద్ద బస్సు లోకేషన్ ఉన్నట్లు గుర్తించారు. ఓ దొంగ ఈ బస్సును దొంగిలించినట్లు చెబుతున్నారు. నాయుడుపేట వద్ద బస్సు చార్జింగ్ అయిపోవడంతో బస్సుని రోడ్డు పక్కన నిలిపివేసి దొంగ పరారైనట్లు చెబుతున్నారు. అనంతరం పోలీసులు బస్సును స్వాధీనం చేసుకుని టిటిడి అధికారులకు అప్పగించారు.

వేడుకగా సూర్యప్రభ వాహనసేవ

రామకృష్ణ గోవింద అలంకారంలో శ్రీమలయప్ప



ప్రజాశక్తి- తిరుమల: శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడో రోజు ఆదివారం ఉదయం 8 గంటలకు శ్రీమలయప్ప స్వామివారు సూర్యమండల మధ్యస్థుడై హిరణ్మయ స్వరూపుడిగా రామకష్ణ గోవింద అలంకారంలో భక్తులను కటాక్షించారు. శ్రీ మలయప్పస్వామివారు శంఖు చక్రాలు, కత్తి, విల్లు, బాణం, వరద హస్తంతో భక్తులకు దర్శనం ఇచ్చారు.

సూర్యప్రభ వాహనం - ఆయురారోగ్యప్రాప్తి

సూర్యుడు సకలరోగ నివారకుడు, ఆరోగ్యకారకుడు, ప్రకతికి చైతన్యప్రదాత ఔషధీపతి అయిన చంద్రుడు కూడా సూర్యతేజం వల్లనే ప్రకాశిస్తూ వద్ధి పొందుతున్నారు. ఈ ఉత్సవంలో శ్రీవారి చుట్టూ ఉన్న సూర్యప్రభ సకల జీవుల చైతన్యప్రభ, సూర్యమండల మధ్యవర్తి శ్రీమన్నారాయణుడే. అందుకే సూర్యున్ని సూర్యనారాయణుడు అని కొలుస్తున్నాం. సూర్యప్రభ వాహనంలో స్వామివారిని దర్శిస్తే ఇతోధిక భోగభాగ్యాలు, సత్సంతాన సంపదలు, ఆయురారోగ్యాలు సిద్ధిస్తాయి. రాత్రి 7గంటలకు చంద్రప్రభ వాహనంపై శ్రీమలయప్పస్వామివారు అనుగ్రహిస్తారు. ఈకార్యక్రమంలో తిరుమల పెద్దజీయర్‌స్వామి, తిరుమల చిన్నజీయర్‌స్వామి, టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి దంపతులు, ఈవో ఎవి.ధర్మారెడ్డి దంపతులు, ఢిల్లీ స్థానిక సలహా మండలి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, బోర్డుసభ్యులు సీతారెడ్డి, అశ్వర్థనాయక్, సుబ్బరాజు, శేషుబాబు, జెఈవోలు సదాభార్గవి, వీరబ్రహ్మం, సివిఎస్వో నరసింహ కిషోర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథంతో పనిచేయండి

వ్యకాసం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు



ప్రజాశక్తి- తిరుపతి టౌన్: ఆశ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో రెండు రోజులు పాటు ఆశ కార్మికులకు తిరుపతి సిఐటియు కార్యాలయంలో విద్య, వైజ్ఞానిక శిక్షణా తరగతులు జరిగాయి. అందులో భాగంగా ఆదివారం మొదటిరోజు శాస్త్రీయ దక్పథం, కార్మిక సంస్కరణలపై క్లాసు జరిగింది. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దడాల సుబ్బారావు మాట్లాడుతూ ప్రస్తుతం దేశంలో అధికారంలో మతోన్మాద బిజెపి ప్రభుత్వం ప్రజలను మనుధర్మ శాస్త్రాన్ని అనుసరించి వుండాలని మూఢనమ్మకాల వైపు మళ్లిస్తున్నారని, దోపిడీ నుండి అప్రమత్తంగా ఉండడానికి శాస్త్రీయ దక్పథంతో మెలగాలని తెలిపారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి మాట్లాడుతూ నేడు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక చట్టాలను సవరణలు చేస్తూ అన్ని రకాల కార్మికులకు ఉపాధి లేకుండా కనీస వేతనాలు అమలు చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తుందని అన్నారు. ఇలాంటి సంస్కరణలను కార్మికవర్గం వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి మాట్లాడుతూ ఆశా కార్మికులచే అనేకరకాల పనులు చేయించుకుంటూ ఆశా కార్మికులను నిర్లక్ష్యం చేయడం సరైనది కాదని అన్నారు. నేడున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై ఈ శిక్షణా తరగతుల్లో బోధించడం జరిగిందని తెలిపారు. శిక్షణా తరగతుల్లో చిత్తూరు జిల్లా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వాడ గంగరాజు, తిరుపతి జిల్లా, చిత్తూరు జిల్లా, నెల్లూరు జిల్లా, ప్రకాశం జిల్లాల ఆశా కార్మికులు పాల్గొన్నారు.

నేటి నుంచి 'ఏపీపీఎస్సీ' ఆన్‌లైన్ పరీక్షలు

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: ఈనెల 25వ తేదీ సోమవారం నుండి 11 కేటగిరీలలో ఉద్యోగ నియామకాలకు ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆన్లైన్ పరీక్షలు నిర్వహణ ఉంటుందని ఏర్పాట్లు పకడ్బందీగా జరగాలని జిల్లా రెవెన్యూ అధికారి పెంచల కిషోర్ సంబంధిత అధికారులను ఆదేశించారు . ఆదివారం ఉదయం స్థానిక కలెక్టరేట్లో ఏపీపీఎస్సీ పరీక్షల నిర్వహణపై డిఆర్ఓ సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. డిఆర్ఓ మాట్లాడుతూ ఈనెల 25 నుండి అక్టోబర్ 6 వరకు అలాగే ఈనెల 28న అక్టోబర్ 2న మినహా ఈపరీక్షలు ఏడు రోజులపాటు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా ప్రొబేషన్ ఆఫీసర్ గ్రేడ్-2 టెక్నికల్ అసిస్టెంట్ (జియో-ఫిజిక్స్), గ్రౌండ్ వాటర్ సబ్-సర్వీస్, ఫిషరీస్ అసిస్టెంట్ ఇన్స్పెక్టర్, తెలుగులో జూనియర్ అనువాదకుడు, ఇండస్ట్రియల్ ప్రమోషన్ ఆఫీసర్, టెక్నికల్ అసిస్టెంట్ మైన్స్, జియాలజీ సబ్-సర్వీస్, ఫుడ్‌సేఫ్టీ ఆఫీసర్, గ్రూప్-4 సేవలు, సివిల్ అసిస్టెంట్ సర్జన్ సంబందించి ఈపరీక్షలు పూర్తిగా కంప్యూటర్ బేస్డ్ ఆన్లైన్ పరీక్షలని జిల్లాలో మూడు కేంద్రాల్లో రెండు షెసన్స్‌లో నిర్వహణ వుంటుందని తెలిపారు. ఈ పరీక్షలకు 3363మంది హజరు కానున్నారని తెలిపారు. పరీక్షల కేంద్రాల్లో విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని, అభ్యర్థులకు రవాణా ఏర్పాట్లు ఆర్టీసీ అధికారులు చూడలన్నారు. ఈసమీక్షలో విద్యుత్‌శాఖ ప్రభాకర్, ఆర్టీసీ సత్యనారయణ, వైద్యశాఖ డాక్టర్ ప్రకాష్, స్పెసల్ బ్రాంచ్ ఎస్ఐ చంద్రశేఖర్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ముగిసిన వర్క్‌షాప్

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: సెట్విన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రెండు రోజుల శిక్షణ వర్క్‌షాప్ ఆదివారం ముగిసింది. ఈ ముగింపు కార్యక్రమానికి సజన టెక్నాలజీ ఎండి పి.లక్ష్మణ నారాయణ, బాలాజీ నర్సింగ్ కాలేజ్ చైర్మన్ డాక్టర్ వై.ప్రవీణ్, సెట్విన్ సీఈఓ డాక్టర్ మురళీకష్ణ ముఖ్యఅతిథులుగా విచ్చేశారు. ఈకార్యక్రమంలో పాల్గొన్న యువతీ యువకులకు సర్టిఫికెట్లు ప్రధానం చేశారు. ఈసందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ ప్రతినెలా ఇటువంటి వినూత్న కార్యక్రమాలు యువతీ యువకులకు అందించాలని అందుకు తన తోడ్పాటును కూడా అందిస్తానని అన్నారు. యువతీ యువకులు మాట్లాడుతూ ఈకార్యక్రమం వారి జీవితానికి ఎంతో ఉపయోగపడుతుందని, ఈ రెండు రోజులు కార్యక్రమంలో వాళ్ళు ఎంతో ట్రాన్స్ఫర్ అయ్యామని వెల్లడించారు. కార్యక్రమంలో పవన్, దేవరకొండ చక్రధర్, గురు, మనోజ్, కిషోర్, ఏ.గీత, పర్షియా,హేమంత్ చరణ్ ,తదితరులు పాల్గొన్నారు.



'డబుల్ డెక్కర్' కోసం చెట్ల నరికివేత

పర్యావరణ పరిరక్షణ పట్టని అధికారులు


కెటిరోడ్డులో చెట్లను నరికేస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: నగరంలో డబుల్ డెక్కర్ బస్సు నడపడానికి రోడ్లపై ఎలాంటి అడ్డంకులు ఉండకూడదని రోడ్డుకి ఇరువైపులా ఉన్న చెట్లను రెండు రోజుల నుంచి యథేచ్ఛగా నరికి వేస్తున్నారు అధికారులు. తిరుపతి స్మార్ట్‌సిటీ పథకంలో రెండు కోట్ల 31 లక్షలతో డబుల్ డెక్కర్ బస్సు కొనుగోలు చేసి ఆర్టీసీ అప్పచెప్పారు. ఈ బస్సును తిరుపతిలో నూతనంగా 12 మాస్టర్ ప్లాన్ రోడ్లను తిప్పేందుకు చర్యలు చేపట్టారు. డబుల్‌డెక్కర్ బస్సు యాత్రికులకు ఆకర్షించేలా ఉండేందుకు తుడా రోడ్డు, తిలక్‌రోడ్డు, అలిపిరి రోడ్డు, కపిల్‌తీర్థం రోడ్డు ఎస్వీ యూనివర్సిటీ రోడ్డు ఇరువైపులా ఉన్న భారీ చెట్లను కొమ్మలను నరికి వేశారు. ఎస్‌వి యూనివర్సిటీ వద్ద ఉండే చింత చెట్ల కొమ్మలను తొలగించడం వల్ల ఆ ప్రాంతంలో పర్యావరణం పరిరక్షణకు ప్రమాదం పొంచి ఉందని ఇటు విద్యార్థులు అటు ప్రజలు విమర్శలు చేస్తున్నారు. వంద సంవత్సరాలు పైబడిన చింతచెట్లు ఎస్వీ యూనివర్సిటీ వద్ద ఉండడం వల్ల పర్యావరణ ప్రేమికులు కూడా అధికారుల తీరుపై తప్పు పడుతున్నారు. ప్రతి ఏడాది నగరంలో మున్సిపల్ కార్పొరేషన్ తుడ, టీటీడీ అటవీ శాఖ రోడ్లకు ఇరువైపులా చెట్లు నాటేవారు దాన్ని పరిరక్షించాలని పదేపదే చెప్పే అధికారులు డబుల్ డెక్కర్ బస్సు కోసం చెట్లను నరికి వేయడం దారుణం అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు చెట్లను కొమ్మలను నరికి వేయడం కన్నా వాటిని పరిరక్షిస్తే భావితరాల ప్రజలకు పర్యావరణ సమస్యలు ఎదురుకాని పర్యావరణ ప్రేమికులు అంటున్నారు.

కేసులకు భయపడం

క్రియాశీలక కార్యకర్తలే జనసేనకు బలం : రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగబాబు

ప్రజాశక్తి- తిరుపతి (మంగళం): అధికార పార్టీ పెట్టే అక్రమకేసులకు జనసేన భయపడదని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగబాబు అన్నారు. ఆదివారం తిరుపతి నగరంలో జరిగిన ఉమ్మడి చిత్తూరు జిల్లా క్రియాశీలక కార్యకర్తల సమావేశం అనంతరం నాగబాబు మీడియాతో మాట్లాడారు. జనసైనికులు భూములు దోచుకుంటేనో... స్కామ్‌లు చేశారనో కేసులు పెట్టించుకోలేదని, న్యాయం, ధర్మం కోసం పోరాటం చేస్తుంటే కేసులు పెడుతున్నారన్నారు. గతంలో రాయలసీమ జిల్లాల్లో పర్యటించిన సందర్భంలో చిత్తూరు, కడప జిల్లాల్లో పర్యటించలేదన్నారు. అందుకే తమ పార్టీ నాయకుల్లో ఆత్మ స్థైర్యం నింపి, క్షేత్ర స్థాయిలో జరిగే అనేక అంశాలపై అందరితో మాట్లాడేందుకు వచ్చామన్నారు. జనసైనికులు చిన్నచిన్న కార్యక్రమాలు చేసినా సరే కేసులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జనసైనికులు ఇలాంటి కేసులకు భయపడరన్నారు. చంద్రబాబుని జైల్లో పెట్టిన సందర్భంలో ఆయన్ని కలిసి భవిష్యత్‌లో టిడిపి జనసేన కలిసి పోటీ చేయడానికి తమ పార్టీ అధ్యక్షులు నిర్ణయం తీసుకున్నారన్నారు. ఎవరు సిఎం అవ్వాలనే దానికంటే ముందు ప్రభుత్వం ఏర్పాటు చేయాలన్న లక్ష్యంతో ముందుకు వెళుతున్నామన్నారు. తమ నాయకుడికి ప్రజల శ్రేయస్సు ముఖ్యమన్నారు. పార్టీ ప్రయోజనాల కంటే రాష్ట్ర ప్రయోజనాలు ముఖ్యమన్నారు. టిడిపి కూడా అదే ధోరణితో ఉండటం వల్ల కలిసి వెళ్లాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. ఎవరు సిఎం కావాలనేది కాలమే నిర్ణయిస్తుందన్నారు. జనసేనలో నాయకత్వ లోపం లేదని, జనసైనికులంతా నాయకులేనన్నారు. కోట్లు కొల్లగొట్టే నాయకులు తమ పార్టీలో లేకపోవడం తమ అద్రుష్టమన్నారు. ఒకరు దెబ్బతింటే వారిని తొక్కేసి పైకి రావాలని జనసేన ఎప్పటికీ ప్రయత్నం చేయదన్నారు. అవకాశవాద రాజకీయాలు, నీచ రాజకీయాలను జనసేన ఎప్పటికీ చేయదన్నారు. చంద్రబాబు ఆ పరిస్థితిల్లో ఉన్నప్పుడు ఆయనకు, టిడిపికి తమ నాయకుడు ఒక భరోసా ఇచ్చారన్నారు. జనసేనలో 99 శాతం మంది పవన్ కళ్యాణ్ మాటకు కట్టుబడి ఉన్నారన్నారు. ఎవరైనా ప్యాకేజ్ స్టార్ అంటే చెప్పుతో కొడతామన్నారు. డాక్టర్ హరిప్రసాద్ లాంటి నాయకులు చిత్తూరు జిల్లాకు చాలని, భూ ఆక్రమణలు చేసిన వాళ్లు, వందల కోట్లు దోచుకున్న వారు తమకు అవసరం లేదన్నారు. వారాహి యాత్ర రాయలసీమలో చాలా బలంగా నిర్వహించ బోతున్నామన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ , జాతీయ మీడియా అధికార ప్రతినిధి వేములపాటి అజయ్ కుమార్, జనసేన పార్టీ ఆస్ట్రేలియా కో ఆర్డినేటర్ కలికొండ శశిధర్, జనసేన నేతలు కిరణ్ రాయల్, రాజారెడ్డి, కీర్తన, నియోజకవర్గ బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.


మీడియాతో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగబాబు

2500 మంది సిబ్బందితో పారిశుధ్య చర్యలు

టీటీడీ ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ శ్రీదేవి



ప్రజాశక్తి- తిరుమల: శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో దాదాపు 2500 మంది సిబ్బందితో పారిశుధ్య చర్యలు చేపడుతున్నట్లు టీటీడీ ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ శ్రీదేవి తెలిపారు. తిరుమల రాంభగీచా-2లోని మీడియా సెంటర్‌లో ఆదివారం ఆరోగ్యశాఖాధికారి మీడియా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ శ్రీదేవి మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల రోజుల్లో 243 మందిని, గరుడసేవనాడు 774 మంది అదనంగా ఏర్పాటు చేసుకున్నామని వివరించారు. గరుడసేవనాడు మొత్తం 136 టన్నుల చెత్తను తొలగించామన్నారు. రథోత్సవం నాడు మాడ వీధుల్లో ఇసుకను తొలగించేందుకు అదనంగా 278 మంది సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఆలయ మాడ వీధుల్లో భక్తులకు తాగునీటిని అందించేందుకు 230 తాగునీటి పాయింట్లు ఉన్నాయని, బ్రహ్మోత్సవాల్లో అదనంగా 187 పాయింట్లు ఏర్పాటు చేశామని వివరించారు. గరుడ సేవ 681 మంది శ్రీవారి సేవకులతో భక్తులకు తాగునీరు అందించినట్లు చెప్పారు. మాడవీధులు, ఇతర ప్రాంతాల్లో 3 రైడ్ ఆన్ యంత్రాలు, 12 జెట్ మెషిన్లు, ఒక గల్ఫర్‌తో పారిశుధ్యచర్యలు చేపట్టామన్నారు. కర్నూలులోని రీజనల్ ప్రయోగశాల, తిరుమలలోని టీటీడీ ఆహార ప్రయోగశాల నిపుణులు తిరుమలలోని తాగునీరు, ఆహార నాణ్యతను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. హెూటళ్లలో ఆహార నాణ్యతకు సంబంధించి భక్తుల నుండి ఫీడ్‌బ్యాక్ సేకరిస్తున్నట్లు చెప్పారు. హెూటళ్లలో ధరల పట్టికను ప్రదర్శించేలా సూచిస్తున్నామన్నారు.


ఆరు రోజుల్లో 23,230 మందికి వైద్యసేవలు
ఇన్‌చార్జి సిఎంఓ డాక్టర్ నర్మద

బ్రహ్మోత్సవాల ఆరురోజుల్లో 23,230 మంది భక్తులకు వైద్యసేవలందించినట్లు టీటీడీ ఇన్‌చార్జి సిఎంఓ డాక్టర్ నర్మద తెలిపారు. మీడియా సెంటర్‌లో డాక్టర్ నర్మద మాట్లాడుతూ భక్తులకు వైద్యసేవలందించేందుకు తిరుమలలో అశ్విని ఆసుపత్రితోపాటు ఆరు డిస్పెన్సరీలు, ఆరు ప్రథమ చికిత్స కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. బ్రహ్మోత్సవాల కోసం అదనంగా 8 ప్రథమచికిత్స కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. స్విమ్స్, బర్డ్, రుయా ఆసుపత్రుల నుండి 40 మంది డాక్టర్లు, 35 మంది పారామెడికల్ సిబ్బందిని అందుబాటులో ఉంచామన్నారు. భక్తుల కోసం 24 గంటల పాటు 13 అంబులెన్సులను అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. గరుడసేవ నాడు 4800 మందికి వైద్యసేవలందించామని, మాడవీధుల్లో బ్యాటరీ వాహనాల్లో దాదాపు 10 వేల మందికి మందులు పంపిణీ చేశామని తెలిపారు. చక్రస్నానం రోజు శ్రీవరాహస్వామివారి ఆలయం వద్ద వైద్యబందంతోపాటు అంబులెన్సును అందుబాటులో ఉంచుతామని, నూతన పరకామణి భవనం వద్ద మరో అంబులెన్సు ఉంటుందని తెలిపారు. మీడియా సమావేశంలో అశ్విని ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కుసుమకుమారి, ఎపిఆర్వో కుమారి పి.నీలిమ పాల్గొన్నారు.

కాలినడక మార్గంలో సంరక్షణ చర్యలు

బ్రహ్మోత్సవాల తరువాత పూర్తిస్థాయి పరిష్కారం
ప్రజాశక్తితో జిల్లా అటవీశాఖ అధికారి సతీష్ రెడ్డి

ఇంటర్వ్యూ



ప్రజాశక్తి- తిరుపతి(మంగళం): తిరుమల కాలినడక మార్గంలో ఎన్నడూ లేని విధంగా వన్యప్రాణులు భక్తులు సంచరించే ప్రదేశాలలో కనబడుతూ భౌతిక దాడులకు తెగబడడం యావత్తు శ్రీవారి భక్తులను, టీటీడీని కలవరపెడుతోంది. ఇప్పటివరకు చిరుతలు సంచరించిన ప్రదేశంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో ట్రాఫ్ కెమెరాలను ఏర్పాటు చేసి వాటి గమనాన్ని గుర్తించిన అధికార యంత్రాంగం బోన్లు ఏర్పాటు చేసి బంధించి తిరిగి క్షేమంగా దట్టమైన అటవీ ప్రాంతంలో వదిలిపెట్టడం జరుగుతోంది. ఇంత కార్యచరణతో అటవీ శాఖ అధికారులు విధులు నిర్వహిస్తున్న శేషాచలం అటవీప్రాంత సరిహద్దుల్లో ఎక్కడో ఒకచోట చిరుతల సంచారం ఒకింత కలవరపాటుకు గురిచేస్తుంది. ఈ నేపథ్యంలో జిల్లా అటవీ శాఖ అధికారి సతీష్ రెడ్డితో ప్రత్యేక ఇంటర్వ్యూను నిర్వహించింది.

ప్రజాశక్తి: కాలినడక మార్గంలో చిరుతల సంచారం ఎందుకు పెరిగింది?

డిఎఫ్ఓ: శేషాచలం అటవీ ప్రాంతంలో ఉన్న తిరుమల క్షేత్రంకు ప్రపంచ వ్యాప్తంగా భక్తులు, యాత్రికులు వస్తుంటారు. అటవీ పరిధి కూడా చాలా ఎక్కువే. ఈ క్రమంలో అనాధిగా తిరుమల శ్రీవారి దర్శనార్థం వచ్చే సామాన్య, మధ్య తరగతి భక్తులు ఎక్కువ భాగం కాలినడకన వెళ్ళడం జరుగుతోంది. కరోనా సమయంలో తిరుమల కాలినడక మార్గం మూత పడడం, శ్రీవారి దర్శనాలను టిటిడి అధికారులు రద్దు చేయడంతో ఎప్పుడూ సందడిగా ఉండే కాలినడక మార్గం సందడి లేకపోవడంతో చిరుతలు ఆహారాన్వేషణ కోసం ఇటువైపుగా రావడం జరిగింది.

ప్రజాశక్తి: ట్రాప్ కెమారాల ద్వారా చిరుతల సంఖ్య గుర్తించవచ్చా?

డిఎఫ్ఓ: ప్రజలు వన్యప్రాణుల ద్వారా భయాందోళనకు గురి అయినప్పుడు ఆయా వన్య ప్రాణులను సంచారం నిర్ధారించడానికి ట్రాప్ కెమరాలను వినియోగిస్తాం. ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ట్రాప్ కెమరాల్లో ఒకే చిరుత పలు కెమరాల్లో రికార్డు అయ్యిందా అనే సమాచారం మాత్రం తెలుస్తుంది. గణనకు వేరే మార్గాలూ ఉన్నాయి.

ప్రజాశక్తి: భక్తుల రక్షణలో భాగంగా కర్రలపై వస్తున్న విమర్శలపై ఏమంటారు?

డిఎఫ్ఓ: తిరుమల నడకమార్గంలో భక్తుల భద్రత ప్రాదాన్యంలో భాగంగా భక్తులకు కర్రలు ఇవ్వాలని సమావేశాల్లో నిర్ణయించాం. కానీ ఆత్మరక్షణగా భక్తులు ఆయుదాన్ని కలిగి ఉంటే ఏ వన్యప్రాణి అయినా దాడి చేయడానికి ఆలోచనలో పడుతుంది. కానీ విమర్శకులు దాన్ని గ్రహించలేకపోవడంతో భక్తులకు తప్పుడు సంకేతాలు ఇచ్చారు.

ప్రజాశక్తి: నడక మార్గంలో భక్తులు తీసుకోవవాల్సిన జాగ్రత్తలు?

డిఎఫ్ఓ: సాధారణంగా భక్తులు తినుబండారాలు తింటూ మెట్లమార్గం ద్వారా తిరుమలకు చేరుకుంటారు. ఈక్రమంలో వారు వెంట తెచ్చుకొని మిగిలిన ఆహార పదార్థాలు, చిరుతిండిలను నడక మార్గంలో విడిచి పెట్టడం వలన ఆహారాన్వేషణలో భాగంగా తరచూ వన్యప్రాణాలు కాలినడక మార్గంకు వచ్చే ప్రమాదం ఉంది.

ప్రజాశక్తి: భక్తులకు సురక్షిత మార్గాలు ఏర్పాటు జరుగుతుందా?

డిఎఫ్ఓ: శ్రీవారి భక్తులు, వన్య ప్రాణులను కాపాడాల్సిన భాధ్యత రెండూ మాకు ప్రధానమే. కానీ వన్యప్రాణి చట్టాన్ని అనుసరిస్తూనే భక్తులకు, వన్యప్రానులకు ఎటువంటి హాని కలుగకుండా చర్యలు తీసుకోవాల్సిన పరిస్థితి. ఇటీవల రాష్ట్ర పిసిసిఎఫ్ మాధుసూధన్ రెడ్డి తిరుమల పర్యటన నేపథ్యంలో కొన్ని మార్గదర్శకాలను అధ్యయనం చేశారు. బ్రహ్మోత్సవాల తరువాత వాటిని అమలుచేసి సమస్యకు పూర్తి పరిష్కారం అయ్యేలా చర్యలు చేపడుతాం.

ప్రమాదపు అంచున డ్రాగన్ ట్రైయిన్..

పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-వెంకటగిరి: ప్రతి ఏటా వెంకటగిరి పోలేరమ్మ జాతరకు సంచార వ్యాపారులు పెద్దఎత్తున చూపరులకు ఆకర్షణగా నిలుస్తారు. వచ్చే నెల 4,5తేదీల్లో జరగనున్న పోలేరమ్మజాతరకు ముందస్తుగా చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన డ్రాగన్ ట్రైయిన్ ఏర్పాటు చేసిన కొవెల్లన్ తీరప్రాంతం కావడంతో ప్రమాదపు అంచున వుందని చూపరులు పలువురు అధికారుల తీరుపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ స్థలాన్ని స్థల యజమానులు ఇవ్వకపోవడంతో కొవెల్ల నది తీరప్రాంతంలో మట్టిని తోలి ఈఎగ్జిబిషన్ ఏర్పాటు చేసుకుంటున్నారు. ఈఏర్పాటు సందర్శకులను ఆందోళన గురి చేస్తుంది. వెంకటగిరిలో గత 15సంవత్సరాలుగా ఏర్పాటు చేస్తున్న ఎగ్జిబిషన్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ఈఎగ్జిబిషన్‌లో 90అడుగుల జాయింట్ వీలు, పడవ, సెలంబో, బ్రేక్‌డ్యాన్, డ్రాగెన్ ట్రైయిన్, చిన్న పిల్లల బైకులు, కారులు, నీళ్లలో పడవ, బౌన్సర్ ఏర్పాటు చేశారు. చట్టుపక్కల ఉన్న ప్రజలు ఈఎగ్జిబిషన్‌ను ఆదరిస్తున్నారు. మద్రాసు, గుంటూరు, బెంగుళూరు ప్రాంతాల నుంచి సంచార వ్యాపారాలు పెద్దఎత్తున వెంకటగిరికి ప్రతి ఏటా వస్తుంటారు. రోడ్డు మార్జిన్‌లో వీరు వ్యాపారాలు ఇప్పటి నుండే దసరా, దీపావళి వరకు వ్యాపారాలు చేసుకొని జీవనం సాగిస్తుంటారు. దూర ప్రాంతాల నుంచి జాతర సందర్భంగా వెంకటగిరికి వచ్చి వ్యాపారాలు సక్రమంగా జరగకపోయినా రావడం ఆనవాయితీగా పెట్టుకున్నారు. వారు సంపాదించే డబ్బులు మూడు పూట్ల భోజనానికి, రవాణా ఖర్చులకే సరిపోతుంది. గతంలో మున్సిపాలిటీ వారు వీరి వద్ద నుంచి రోడ్డు మార్జిన్ కింద పన్నులు వసూలు చేసే వారు. చిరు సంచార వ్యాపారులు రోడ్డుకు ఇరువైపుల పెట్టుకోవడంతో జాతరకు వచ్చిన భక్తులకు ఈవ్యాపారాలు ప్రత్యేక ఆకర్షణగా మారుతున్నారు. వెంకటగిరిలో గత 10సంవత్సరాలుగా ఏర్పాటు చేస్తున్న ఎగ్జిబిషన్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ఈఎగ్జిబిషన్‌లో 90అడుగుల జాయింట్ వీలు, పడవ, సెలంబో, బ్రేక్‌డ్యాన్, డ్రాగెన్ ట్రైయిన్, చిన్న పిల్లల బైకులు, కారులు, నీళ్లలో పడవ, బౌన్సర్ ఏర్పాటు చేశారు. చట్టుపక్కల ఉన్న ప్రజలు ఈఎగ్జిబిషన్‌ను ఆదరిస్తున్నారు. ఈజాతర వెంకటగిరికి ప్రాంతానికి తలమానికంగా ప్రతి ఏటా జరుగుతుండడంతో ప్రత్యేక ఆకర్షణంగా ప్రాంతంగా నిలుస్తోంది. ఇకనైనా అధికారులు ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసిన పరికరాలను పరిశీలించి చిన్నారులకు ఏలాంటి ఇబ్బందులు కలగకుండే చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.



ప్రమాదపు అంచున ఉన్న డ్రాగన్ ట్రైయిన్

మహిళ అనుమానాస్పద మృతి

భర్తే కారణమని బంధువుల ఆరోపణ

ప్రజాశక్తి - కోట: కోట మండలం వంజివాక గ్రామంలోని పోతురాజు హరిత (23) వివాహిత అనుమానాస్పద స్థితిలో ఆదివారం ఫ్యానుకు ఉరేసుకుని మరణించింది. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈమె మృతికి భర్త రమేష్ కారణమని మృతురాలి బంధువులు ఆరోపిస్తున్నారు. కోట ఎస్ఐ పుల్లారావు సమాచారం తెలుసుకుని సంఘటన స్థలానికి చేరుకుని విచారించారు. మృతదేహాన్ని పోస్టుమా ర్టం నిమిత్తం కోట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.



మృతురాలు హరిత (ఫైల్ ఫోటో)



హరిత మృతికి గల కారణాలు తెలుసుకుంటున్నపోలీసులు

ఆర్‌టిసి బస్టాండ్‌లో వర్షపు నీరు

ప్రయాణికుల ఇబ్బంది



భారీ వర్షానికి ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో నిలిచిపోయిన వర్షపు నీరు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పట్టణంలోని స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో వర్షపు నీరు నిలిచి పోవడంతో ప్రయాణి కులు తీవ్ర ఇబ్బందులు పడు తున్నారు. ప్రయా ణికులు బస్టాండ్ లోపలికి వెళ్లడానికి వర్షపు నీరు నిలిచిపోవడంతో నడిచి వెళ్లడానికి వీలు కావడంలేదని విద్యార్థులు, ప్రయాణికులు, ఆర్‌టిసి ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బస్టాండ్ లోపలికి వెళ్లాలంటే ప్రధాన మార్గమైన రహదారిలో వర్షపు నీరు అధికంగా నిలిచిపోయింది. దీంతో దోమలు సైతం అధికమయ్యాయి. ఈ వర్షపు నీరు నిలిచిన చోట హోటల్స్, తిను బండారాలు, కూల్ డ్రింక్ షాపులు ఉన్నాయి. ద్విచక్ర వాహనాలను పార్కింగ్ చేయడానికి వెళ్లడానికి కూడా ఈ వర్షపు నీరు అడ్డంకిగా ఉందని వాహనదారులు వాపోతున్నారు. దీనిపై డిపో మేనేజరు స్పందించడం లేదని అక్కడి ప్రయాణికులతో పాటు దుకాణదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా డిపో మేనేజర్ స్పందించాలని పలువురు కోరుతున్నారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి- యర్రావారిపాలెం: మండలంలోని బోడెవాండ్లపల్లి గ్రామ పంచాయతీ నాగులకుంటకు చెందిన జానపద కళాకారిణి కట్టమంచి సిద్ధమ్మ(65) గత కొద్ది కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందింది. ఈమె మృతితో ఆ కుటుంబ పోషణకు జీవనా ధారం కోల్పోయింది. దళిత సంఘం నాయకులు పులిచెర్ల మహేష్ ద్వారా అదే గ్రామానికి చెందిన అమెరికాలో నివాస ముంటున్న రాయవరం సహదేవ రెడ్డి, లక్ష్మి కట్టమంచి సిద్ధమ్మకు ఆదివారం పదివేలు ఆర్థిక సాయం అందించారు. వీరు గతంలో పేద విద్యార్థులకు ఆర్థిక సాయం అందించి అనారోగ్యంగా ఉన్న పేదలకు హాస్పిటల్ ఖర్చులు భరించారని బాధితులు తెలిపారు.వారి కుటుంబానికి కట్టమంచి సిద్ధమ్మ కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.



ప్రగతి సేవా సంస్థ సేవలు అభినందనీయం

- డాక్టర్ సాయిశరత్ చంద్రరెడ్డి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : పేదలకు నిస్వార్థంగా సేవలు చేస్తున్న ప్రగతి సేవా సంస్థ సేవలు అభినందనీయమని డాక్టర్ సాయిశరత్ చంద్రారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం గూడూరు పట్టణంలోని బాలాజీ నగర్ ప్రాంతంలో ఉన్న ప్రగతి సేవా సంస్థ కార్యాలయంలో పేదలకు ఫల సరుకులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ సాయి శరత్ చంద్ర రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెల క్రమం తప్పకుండా సంస్థ ఆధ్వర్యంలో పేదలకు ఫల సరుకులు పంపిణీ చేయడం అభినంద నీయమన్నారు. ప్రతి ఒక్కరూ సేవా దృక్పథాన్ని అలవరచుకోవాలన్నారు. అనంతరం ఈ కార్యక్రమానికి దాతగా వ్యవహరించిన పోణకా మల్లికార్జున్ రెడ్డిని అభినందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు కడివేటి చంద్ర శేఖర్ , ఉపాధ్యక్షులు బండి ధనంజయ రెడ్డి,జాయింట్ సెక్రటరీ యమహా సుబ్రమణ్యం, కార్యవర్గ సభ్యులు కరిముల్లా , రాధయ్య , ఐటిఐ ప్రభాకర్, ప్రభాకర్, కేఆర్ఎం , వెంకటేశ్వర్లు, దయాకర్, పిల్లెల శ్రీను, కుమార్ నాయుడు, నాగరాజు పాల్గొన్నారు.

బాబు అరెస్టుకు నిరసన

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: మాజీ ముఖ్యమంత్రి, టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు అరెస్టును నిరసిస్తూ ఓ టీడీపీ కార్యకర్త అర గుండు గీయించుకుని ఆదివారం వినూత్న రీతిలో నిరసన తెలిపాడు. టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాదిపాకల గోపీనాథ్ స్థానిక ఎన్టీఆర్ భవన్ వద్ద అందరూ చూస్తుండగానే అరగుండు గీయించుకుని వైసిపి ప్రభుత్వం పై తీవ్ర నిరసన తెలిపారు. మచ్చలేని చంద్రబాబుపై అవినీతి మకిలి పూయాలని జగన్ ఎంత ప్రయత్నించినా బాబు కడిగిన ముత్యంలా తిరిగి వస్తాడని గోపి ఆశాభావం వ్యక్తం చేశారు.

టిడిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టును ఖండిస్తూ ఆ పార్టీ తెలుగు మహిళా విభాగం నాయకులు స్థానిక ఎన్టీఆర్ భవన్ వద్ద చేస్తున్న రిలే దీక్ష ఆదివారంతో మూడో రోజు చేరుకుంది. ఆ పార్టీ తిరుపతి పార్లమెంటు నియోజకవర్గం మహిళా విభాగం అధ్యక్షురాలు చక్రాల ఉషా ఆధ్వర్యంలో తెలుగు మహిళలు మొక్కవోని దీక్షతో నిరసన తెలుపుతుండడం గమనార్హం. బాబు జైలు నుంచి విడుదలయ్యే వరకు తమ దీక్షను ఆపమనీ, అవసరమైతే ఆమరణ నిరాహారదీక్షకు సైతం పూనుకుంటామని హెచ్చరించారు. టిడిపి పట్టణ అధ్యక్షుడు విజయ్ కుమార్ నాయుడు, ఎస్సీవీ దిలీప్ నాయుడు కృష్ణవేణి సుమతి సుభాషిని రేణుక, కుమారి, మల్లీశ్వరి పాల్గొన్నారు.

గూడూరు : టిడిపి కార్యాలయంలో చేస్తున్న రిలే నిరాహార దీక్షలు 12వ రోజులో భాగంగా వాకాడు మండల టిడిపి కుటుంబ సభ్యులతో కలసి దీక్షలో పాశం సునీల్ కుమార్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి శీలం కిరణ్ కుమార్, వాకాడు మండల పార్టీ అధ్యక్షులు దువ్వూరు మధురెడ్డి, ప్రధాన కార్యదర్శి కృష్ణ మూర్తి, రాష్ట్ర బీసీ సభ్యులు కాకి శ్రీనివాసులు,నాయకులు రాజగోపాల్ రెడ్డి,గోవిందయ్య,వేణు నాయుడు, శ్రీనివాసులు రెడ్డి,మోహన్ నాయుడు,సుధాకర్ రెడ్డి,దయాకర్,రమణయ్య, తీపలపూడి రమణయ్య,బుజిగేంద్ర,గౌస్ బాషా,మహిళలు ప్రమీలమ్మ, చిరంజీవమ్మ మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

29న మహాధర్నాను విజయవంతం చేయండి: కెవిపిఎస్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : సామాజిక న్యాయం కోసం, కుల వివక్ష పోరాట సమితి తలపెడుతున్న మహా ధర్నా లో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొనాలని కెవిపిఎస్ పట్టణ కార్యదర్శి అడపాల ప్రసాద్ పిలుపునిచ్చారు. ఈ నెల 29 న కెవిపిఎస్ ఆధ్వర్యంలో విజయవాడ ధర్నా చౌక్ లో జరిగే మహా ధర్నా ను విజయవంతం చేయాలని కోరుతూ గూడూరులోని సిపిఎం కార్యాలయంలో ఆదివారం కరపత్రాలు, గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అడపాల ప్రసాద్ మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చి ఏడు దశాబ్దాలు పూర్తయినా నిమ్న కులాల వారు అర్థ స్వాతంత్ర జీవితం గడుపుతున్నారన్నారు. ఎస్సీ, ఎస్టీ ల అభివృద్ధికి కేటాయిస్తున్న సబ్ ప్లాన్ నిధులు పక్కదారి పడుతున్నాయని ఎస్సీ, ఎస్టీల అత్యాచార నిరోధక చట్టాన్ని నీరు గార్చే 41 సిఆర్‌పిసిని వెంటనే రద్దు చేయాలన్నారు. దళిత గిరిజనులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్తును 300 యూనిట్ల కు పెంచాలన్నారు. జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫారసులను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కోనేరు రంగారావు భూ కమిటీ సిఫారసులను అమలు చేసి అసైన్డ్ చట్ట సవరణ ఉపసంహరించాలని పేదలకు మిగులు భూమి పంచాలన్నారు. డప్పు, చర్మకారుల పెన్షన్ ను ఐదువేల రూపాయలకు పెంచాలన్నారు. శ్మశాన వాటిక కార్మికులను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. ప్రభుత్వ రంగాన్ని కాపాడుదాం- ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సెంట్రల్ శాఖ కార్యదర్శి జోగి శివకుమార్, సిఐటియు నాయకులు వెంకటరామిరెడ్డి, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు పుట్ట శంకరయ్య, సిఐటియు పట్టణ కార్యదర్శి సురేష్, సిఐటియు నాయకులు పామంజి మణి , ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షులు బివి రమణయ్య, విఆర్‌ఏ నాయకులు వెంకట సుబ్బయ్య , చంద్రయ్య , శ్రామిక మహిళ నాయకులు ధనమ్మ , నరసమ్మ , వరలక్ష్మి , సాయి ప్రసన్న పాల్గొన్నారు.



విజయవాడ మహా ధర్నా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కెవిపిఎస్ పట్టణ కార్యదర్శి అడపాల ప్రసాద్

మృత్యువు ఒడిలో ఓ తల్లి పోరాటం.. బతకాలని ఆరాటం..

- ఓ వైపు కిడ్నీ వ్యాధి.. మరో వైపు పేదరికం
- ముగ్గురు పిల్లలకు ఒక పూట అన్నం పెట్టలేని దుస్థితి
- దాతల సాయం కోసం ఎదురుచూపు

ప్రజాశక్తి - గూడూరు రూరల్ : గూడూరు లోని, తూర్పు వీధి గిరిజన కాలనీకి చెందిన పామూరు వెంకటమ్మ అనే నిరుపేద యువతి కిడ్నీ కి సంబంధించిన వ్యాధి తో బాధ పడుతోంది. ఆమె వయసు 30 సంవత్సరాలు. ఈ సమయంలో ఆమె భర్త ఆమెకు తోడుగా నీడగా ఉండాల్సింది పోయి ఆమెకు కిడ్నీ వ్యాధి జబ్బు వచ్చిందని ఆమె తనకు ఇంక అవసరం లేదని ఆమెను వదిలిపెట్టి అతను వెళ్లిపోయాడు. ఆమె ఒంటరిగా మిగిలి పోయింది.. ఆమెకు ముగ్గురు చిన్న పిల్లలు వున్నారు. వారి ఆలనా పాలనా చూడాల్సిన స్థితి నుండి అన్నం పెట్టాలని స్థితికి వచ్చి ఒక తల్లిగా ఉండి తాను ఏమీ చేయలేక పోతున్నానని ఆవేదన చెందుతోంది. తన బిడ్డలకి తాను అన్నం పెట్టలేని దుస్థితిలో వుంది. చూడడానికి శక్తి లేదని, ఆహారం పెట్టడానికి ఆమె దగ్గర సరైన సరుకులు లేవు. ఆమె ఒంటరి పోరాటం చేస్తూ జీవనం సాగిస్తోంది. శివాలయం ఆటో స్టాండు వారు రెడ్ సంస్థ వారికి తెలపడంతో సనిశెట్టి వేంకట శ్రీధర్ జ్ఞాపకార్థం వారి కుమారుడు సాయి కృష్ణ చైతన్య దాతృత్వంతో ఆదివారం ఒక నెలకి సరిపడ సరుకులు అందించారు. రెడ్ సంస్థ సభ్యులు జానా సుధీర్, శ్రీనివాస్ ఆచారి, జమీర్, ఆటో స్టాండ్ సభ్యులు శ్రీను, సలీం, పాల్గొన్నారు. మన గూడూరులో దాతలు ఎవరైనా ముందుకు వచ్చి వాళ్లకు ఏమైనా సహాయం చేయాలని కోరుకుంటున్నారు.



వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలుకు ఘన స్వాగతం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : చెన్నైలో నూతనంగా ప్రారంభించిన వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు గూడూరు రైల్వే స్టేషన్‌కు చేరుకోవడంతో పలువురు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన సంప్రదాయ నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. రైలుకు స్వచ్ఛంద్ర కార్పొరేషన్ ఛైర్పర్సన్ పోణకా దేవసేనమ్మ , బీజేపీ నాయకులు , తదితరులు కలిసి స్వాగతం పలికారు. రైలు లో కి వెళ్లి వసతులను పరిశీలించారు. అనంతరం జెండా ఊపి వీడ్కోలు పలికారు. వందే భారత్ రైలు చూసేందుకు పట్టణ ప్రజలు భారీగా తరలివచ్చారు సెల్ఫీ ఫోటోలు తీసుకునేందుకు పోటీ పడ్డారు. ఈ సందర్భంగా స్వచ్ఛ ఆంధ్ర సంస్థ కార్పొరేషన్ చైర్ పర్సన్ పోణకా దేవసేనమ్మ మాట్లాడుతూ వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు ద్వారా సమయం ఎంతో ఆదా అవుతుందని , త్వరితగతిన విజయవాడ, చెన్నై కు వెళ్లేందుకు అవకాశం కలిగిందని పేర్కొన్నా రు. మన రాష్ట్ర నికి రెండు రైలు మంజూరు చేసిన ప్రధానికి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం పలు పాఠశాల లకు చెందిన చిన్నారులు జాతీయ జెండాను చేపట్టి జై భారత్ అంటూ నినాదాలు చేశారు. చిన్నారులు ప్రదర్శించిన దేశ భక్తి గీతాలు , నృత్య ప్రదర్శనలు అందరిని అలరించాయి. చిన్నారులను, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్ పర్సన్ దేవసేనమ్మ అభినందించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు , డిఆర్‌యుసిసి మెంబర్ మయూరి శ్యామ్ యాదవ్, స్టేషన్ మేనేజర్ వెంకటేశ్వర రావు , పురుషోత్తం రెడ్డి , వైసీపీ నాయకులు , గోపాల్ యాదవ్ , కోదండయ్య , విద్యార్థులు పాల్గొన్నారు.



ఘనంగా జాతీయ సేవా పథకం వ్యవస్థాపక దినోత్సవం

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర వ్యవసాయ కళాశాలలో జాతీయ సేవా పథకం వ్యవస్థాపక దినోత్సవాన్ని కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జి. ప్రభాకర రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేట్ డీన్ డాక్టర్ జి. ప్రభాకర రెడ్డి జాతీయ సేవా పథకం వాలంటీర్లను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు సమాజ అభివృద్ధి లో భాగస్వాములు కావాలని సూచించారు. జాతీయ సేవా పథకం ద్వారా వాలంటీర్లలో నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవచ్చున్నారు. చదువుతో పాటుగా సమాజం లో వున్న సమస్యలు పట్ల అవగాహన కలిగి సమస్యల పరిష్కారంలో తన వంతు పాత్రను పోషించాలన్నారు. జాతీయ సేవా పథకంలో భాగంగా గ్రామాలలో చేపట్టిన కార్యక్రమాల గురించి పథకం అధికారి డా. రెడ్డి శేఖర్ వివరించారు. ఉత్తమ సేవలు అందించిన వాలంటీర్లకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ సేవా పథకం అధికారులు డా. సరళ, డా. లీలావతి, డా. వాణి, డా. సంతోష్, డా. చలం, డా. గురివి రెడ్డి, డా. శాంతిప్రియ, డా. శ్రీలత, డా. శాంతి, డా. రూపేష్ కుమార్ రెడ్డి, డా. నాగి రెడ్డి, సూపరింటెండెంట్ నాగేశ్వరి, శ్రీనివాసులు జాతీయ సేవా పథకం వాలంటీర్లు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



మరిన్ని చేతులు సాయమందించాలి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: హెల్పింగ్ హాండ్స్ సంస్థ తరహాలో మరిన్ని చేతలు పేద వారికి సాయం అందించడంలో ముందుకు రావాలని శ్రీకాళహస్తి డిస్‌పి భీమారావు పిలుపు నిచ్చారు. హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం 142వ నెల దివ్యాంగులకు ఇంటి సరుకులను పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన విచ్చేసిన శ్రీకాళహస్తి డిఎస్పి భీమారావు మాట్లాడుతూ హెల్పింగ్ హాండ్స్ సంస్థ గత 142 నెలలుగా నిరంతరం సామాజిక సేవ కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్ర మంలో సంస్థ వ్యవస్థాపకులు మునీర్ బాషా, బాబా ఫరీద్, కంఠా ఉదయ్, రాజేశ్వరరావు, హరి నాయుడు, ఢిల్లీ బాబు, ట్రాఫిక్ ఏఎస్ఐ రియాజ్ బాషా పాల్గొన్నారు.



దివ్యాంగులకు ఇంటి సరుకులు పంపిణీ చేస్తున్నదాతలు



బీమా నమోదుపై అవగాహన కల్పిస్తున్న సచివాలయం కన్వీనర్


గృహ సారధులకు బీమా నమోదుపై సమావేశం

ప్రజాశక్తి -కోట : కోట మండలంలోని వైసీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నల్లపరెడ్డి వినోద్ కుమార్ రెడ్డి నివాసంలో మండల సచివాలయం కన్వీనర్ లు, గృహ సారధులు, గ్రామ వాలంటీర్లతో సమావేశంను నల్లపరెడ్డి వినోద్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో సచివాలయం కన్వీనర్ (జేసీఎస్)షేక్ మొబీన్ బాష మాట్లాడుతూ సచివాలయం గృహ సారధుల బీమా నమోదుపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి వుండాలన్నారు. ఎవరైనా ఆకస్మాత్తుగా మరణిస్తే వారికి ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన ఈ బీమా వల్ల 10 లక్షల రూపాయలు అందేలా ఏర్పాటు చేశామన్నారు. గృహ సారధులు తమ పేరు, పూర్తి వివరాలు, నామినీ లాంటి సమాచారంను యాప్ లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచనలు, సలహాలును అందించారు. మండలంలో 16 సచివాలయాలు ఉన్నాయని గుర్తు చేస్తూ సచివాలయం కన్వీనర్ లు 48 మంది ఉన్నారని,అంతేకాకుండా 616 మంది గృహ సారధులు ఉన్నారన్నారని తెలిపారు. ప్రతి ఒక్కరి మొబైల్ లో యాప్ డౌన్లోడ్ చేసుకుని తక్షణమే మీ వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నల్లపరెడ్డి వినోద్ కుమార్ రెడ్డి, మండల సచివాలయం కన్వీనర్లు, గృహసారధులు, గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు.

మాజీ ఎంపిపికి సన్మానం



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: వేపగుంట వార్డ్ నెంబర్ గా గెలు పొందిన ఏ. భారతి ని పుత్తూరు మాజీ ఎంఎ పీ, చిత్తూరు పార్లమెం టు టీడీపీ ఉపాధ్యక్షులు గంజి మాధవయ్య ను సన్మానించారు. ఎన్నిక సమయంలో ఆయన విదేశీ పర్యటనలో ఉండటంతో ఆదివారం ఆయనను కలిసి సన్మానించారు. ప్రతిష్టాత్మకంగా జరిగిన ఉప ఎన్నికల్లో కష్టపడి గెలిచిన వార్డ్ మెంబర్ ఏ భారతికి, ఆమె విజయంలో కీలక పాత్ర పోషించిన పలువురు నాయకులను గంజి మాధవయ్య తిరిగి సన్మానించారు. ఈ కార్యక్రమంలో పుత్తూరు రూరల్ మండల టీడీపీ అధ్యక్షుడు డి.రవికుమార్, ప్రధానకార్యదర్శి ఏ.బాలాజీ, మాజీ అధ్యక్షులు కరుణా యాదవ్, మోహన్ రాజు, తడుకు సర్పంచ్ బొబ్బిలి యాదవ్, సింగిల్ విండో మాజీ ప్రసిడెంట్ శేఖర్ నాయుడు, టీడీపీ నాయకులు లోకేష్, బుజ్జిబాబు, మహేష్ ఉన్నారు.



ఎన్ఎస్ఎస్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ సుధాకర్ రెడ్డి

విద్యార్థులు సమాజ సేవపై బాధ్యత కలిగి ఉండాలి: ప్రిన్సిపాల్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): విద్యార్థి దశ నుండి సమాజ సేవ పట్ల అవగాహన పెంచుకొని మసులుకోవాలని శ్రీ వెంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.సుధాకర్ రెడ్డి సూచించారు. ఆదివారం తిరుపతి- కరకంబాడి మార్గంలోని ఎస్వీ ఉభయ కళాశాల ఆధ్వర్యంలో 54వ జాతీయ సేవా పథకం ద్వారా కళాశాల దత్తత గ్రామాలైన వెంకటాపురం, అన్నాస్వామిపల్లిలోని అంగన్వాడి విద్యార్థులకు ఉచితంగా నోట్ పుస్తకాలను, చిరు ఆహార పదార్థాలను అందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ ద్వారా ప్రతి విద్యార్థిలో సమాజం పట్ల సేవ గుణాన్ని పెంపొంది స్తుందని, ఫలితాన్ని ఆశించకుండా సహాయ పడడం ద్వారా మంచి పౌరులుగా సమాజంలో ఎదగడానికి అవకాశం వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ సేవా పథకం అధికారులు డాక్టర్ టి. చంద్రయ్య, డాక్టర్ కె.సుజన్ కుమార్, అధికారులు డాక్టర్ సి.చంద్రశేఖర్, డాక్టర్. షేక్ రఫీకిరణ్, కళాశాల వివిధ విభాగా ధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న పనబాక కృష్ణయ్య అభిమానులు

ఘనంగా పనబాక కృష్ణయ్య జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి -గూడూరు: గూడూరు అభివృద్ధి ప్రదాత, విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి డాక్టర్ పనబాక కృష్ణయ్య జన్మదిన వేడుకలు పనబాక దంపతుల అభిమానుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గూడూరు సమీపంలోని మోదుగ వన వినాయక దేవస్థానం లో అడవిలో వినాయకునికి అభిమానుల ప్రత్యేక పూజలు, అభిషేకం చేయించారు. అభిమానులు ఉడతా శరత్ యాదవ్,మేకా శివ కుమార్ యాదవ్ లు మాట్లాడుతూ గూడూరు నియోజకవర్గం అభివృద్ధి లో పనబాక కృష్ణయ్య తనకంటూ ప్రజల్లో చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. బోనుబోయిన చందు యాదవ్, సురేష్, సుజిత్,సాయి, కిరణ్ పాల్గొన్నారు.



తడ సర్పంచ్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే సంజీవయ్య

తడ సర్పంచ్ ని సన్మానించిన ఎంఎల్ఎ

ప్రజాశక్తి -తడ: పార్టీ కోసం పనిచేసే ప్రతి ఒక్కరికీ పార్టీ లో నామినేటెడ్ పదవులలో ప్రాధాన్యత ఉంటుందని ఎవరో ఒకరికి పదవులను కేటాయించడం ద్వారామిగిలిన వారిని తక్కువ చేసినట్లు కాదని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. తడలో ఆదివారం నిర్వహించిన మత్స్యకారుల ఆత్మీయ సమావేశం విజయవంతం చేసిన సందర్భంగా తడ సర్పంచ్ ఆర్ముగంను ఎమ్మెల్యేతో పాటు ఆప్కాబ్ ఛైర్మన్ కోండూరు అనిల్ బాబు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజీవయ్య మాట్లాడుతూ కష్టపడి పని చేసుకుపోతే పదవులు వాటంతట అవే వస్తాయని అన్నారు. పార్టీ కోసం కృషి చేసిన సీనియర్ నాయకుడు ఆర్ముగం తడ సర్పంచ్ కావడంతో పాటు తడ పంచాయతీని రాష్ట్ర స్థాయిలో ఉత్తమ పంచాయతీగా తీర్చి దిద్దారన్నారు. ఈ కార్యక్రమంలో సూళూరుపేట యంపీపీ అనిల్ రెడ్డి , నాయకులు మునీష్ రెడ్డి,వాసు మొదలియార్, శశికుమార్,మురుగన్, ఏ మున స్వామి రెడ్డి,జయ కుమార్ రెడ్డి,రాజ్ కుమార్ పాల్గొన్నారు.



తాగు నీటి సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి -ఏర్పేడు: ఏర్పేడు మండలం పాతవీరాపురం గ్రామస్తుల నీటి పైపు డ్యామేజ్ అవ్వడంతో నీళ్లు రావడంలేదని, ఇబ్బందులు పడుతున్నారని ఆ గ్రామస్తుల ద్వారా సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి వెంటనే ఆదేశాల మేరకు ఏర్పేడు మండల వైసీపీ ఇన్‌ఛార్జి గున్నేరి కిషోర్ రెడ్డి సూచనలతో పైపులు వేయించి నీటి సమస్యను పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాతవీరాపురం సర్పంచ్ పాతగుంట మంజుల , ఏర్పేడు మండల వైసిపి సీనియర్ నాయకులు పాతగుంట గురువారెడ్డి , ఎక్స్ ఎంపీటీసీ మునిరత్నం రెడ్డి, దామోదర్ రెడ్డి, రెడ్డి వారి మోహన్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, కోదండరామిరెడ్డి , గ్రామస్తులు పాల్గొన్నారు.

దొంగ ఓట్లపై సమగ్ర విచారణ జరిపి తొలగించాలి: టిడిపి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి జిల్లా పరిధిలోని ప్రధాన పట్టణాలలో దొంగ ఓట్లపై సమగ్ర విచారణ జరిపి వెంటనే తొలగించాలని తిరుపతి టిడిపి పార్లమెంట్ అధ్యక్షులు నరసింహ యాదవ్ డిమాండ్ చేశారు. ఆదివారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తిరుపతి జిల్లాలోని తిరుపతి నగరం, చంద్రగిరి, గూడూరు, సూళ్లూరపేట ప్రాంతాలలో భారీగా దొంగ ఓట్లు ఉన్నాయన్నారు. ఈ ఏడాది ఓట్లలో యువత నమోదు చేసుకున్న 30 శాతం ఓట్లలో 10 శాతం ఒరిజినల్ ఓట్లని అన్నారు. ఇందులో జెన్యూన్ ఓటర్ల ఇంటికి కలెక్టర్ కార్యాలయం నుండి పోస్టల్ ద్వారా ఓటర్ కార్డులు పంపించబడ్డాయని, దొంగ అడ్రస్సులతో నమోదు చేసిన ఓటర్ కార్డులు తిరిగి కార్యాలయానికి చేరాయన్నారు. మళ్లీ అధికారంలోకి రావడానికి వైసిపి చేస్తున్న జిత్తులే ఈ దొంగ ఓట్ల నమోదని, 2024 ఎన్నికల్లో ప్రజలు అధికార పార్టీకి తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో టిడిపి నాయకులు మనోహరాచారి, శ్యాంబోల హరినాథ్, వేణుగోపాల్ నాయుడు పాల్గొన్నారు.

ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రాష్ట్రీయ క్షత్రియ సేవ సంఘం తిరుపతి పుత్తూరు కు చెందిన డాక్టర్ల సహకారంతో పుత్తూరు పట్టణంలోని స్థానికఎమ్మెస్ ఎం నగర్ వేదవాస విద్యానికేతన్‌లో నిర్వహించిన క్షత్రియ సేవా సంఘం మెగా వైద్య శిబిరంలో ప్రముఖ వైద్య నిపుణులు గుండె, కిడ్నీ, ఎముకలు, నరాలు, షుగర్ హైపర్ టెన్షన్, స్త్రీల వ్యాధులు, ఈసిజి పరీక్షలు, షుగర్ బిపి, మొదలగు అన్ని రకాల జబ్బులతో బాధపడుతున్న వారికి డాక్టర్ వెంకటరమణ, డాక్టర్ రవి రాజు, సురేంద్ర, జయప్రకాష్, శ్రీధర్ రాజు, శ్రీహరి నాయుడు, వంశీ, నరేంద్ర, సేతు మాధవ వర్మ, కే బల రామరాజు, చక్రధర్, సుభాషిణి, ప్రవీణ్, జయలక్ష్మి, నరసింహులు, శ్రీనివాసులు, సత్యావాణి శ్రీపతి డాక్టర్లు వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్య పరీక్షలు చేసిన రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్య శిబిరంలో కేకేసి కళాశాల నర్సింగ్ విద్యార్థులు సహకారం అందించారు. ఈ సందర్భంగా. సి నారాయణ బాబు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో ఏదో ఒక కార్యక్రమాలు శిబిరాలు చేపడు తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వేదవ్యాస విద్యానికేతన్ అధినేత బాల సరస్వతి, క్షత్రియ సేవ సంఘం సభ్యులు వేదవ్యాస పాఠశాల సిబ్బంది, బీసీ రాష్ట్ర నాయకులు, ఏలుమలై, సభ్యులు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలునిర్వహిస్తున్న డాక్టర్లు

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి -నాయుడుపేట: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం నాయకులు కోరారు. మండలాలలోని మధ్యాహ్న భోజనకార్మిక నాయకులు సమావేశం నాయుడుపేట సిఐటియు కార్యాలయం లో ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి కోట, వాకాడు, ఓజిలి, పెళ్ళకూరు, నాయుడుపేట మండలాల నుంచి నాయకులు పాల్గొన్నారు. సమావేశం సుగుణమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి శివకవి ముకుంద మాట్లాడుతూ ఎన్ని పార్టీలు అధికారానికి వచ్చినా మధ్యాహ్న భోజన కార్మికుల బతుకులు మాత్రం మారడం లేదని ఇకనైనా అధికార పార్టీ ఈ ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పట్టించుకుని పరిష్కరించాలని లేనిపక్షంలో మధ్యాహ్న భోజనం కార్మికులు అందరూ ఏకమై పోరాడాలన్నారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కే విజయమ్మ మాట్లాడుతూ గత ఎన్నో సంవత్సరాల నుంచి నెలకొన్న మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, సంవత్సరానికి 12 నెలలు వేతనం ఇవ్వాలని, వారంలో మూడు రోజులు రాగిజావ కు బడ్జెట్ కేటాయించాలని అసెంబ్లీలలో జగనన్న గోరుముద్ద గురించి కార్మికులకు ధరలకు అనుగుణంగా బడ్జెట్ పనికి తగ్గ వేతనం యూనిఫాము, గుర్తింపు కార్డులు, ప్రమాద బీమా, వంట పాత్రలు గ్యాసు ప్రభుత్వమే సప్లై చేయాలని కోరారు. హైస్కూలలో 9,10 తరగతులకు మెనూ చార్జీ ధరలకు అనుగుణంగా ఒక బిడ్డకు 20 రూపాయలు ఇవ్వాలని కోరారు. గ్రామాలలో ఉన్న మధ్యాహ్నం భోజన కార్మికులు వారి గ్రామ సచివాలయాలలో ఈ సమస్యలపై అర్జీ సమర్పించాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మి, ఫాజీరియా, రమణమ్మ, బద్దమ్మ, వాణి,జయమ్మ, విమలమ్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మధ్యాహ్న భోజన సంఘం నాయకురాలు కె విజయమ్మ